క్లుప్తంగా

ఒప్పందాల అమలుకు జీవో విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

గాజువాక: మున్సిపల్ కార్మికులు గతంలో నిర్వహించిన సమ్మె కాలంలో జరిగిన ఒప్పందాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాలని సీపీఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ ప్రయోజనాలు, పదేళ్ల సర్వీసు దాటినవారికి ఆర్థిక ప్రయోజనాలు, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాల పెంపు తదితర అంశాలపై వెంటనే జీవో విడుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు కావస్తున్నా ఈ ఒప్పందంపై స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ డిమాండ్ల సాధనకు జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గొలగాని అప్పారావు, గొల్ల రాము, నక్క నాగరాజు, వై.చిన్నారావు, ఎస్.గణేష్, మీనాక్షి, వరలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

భెల్ ఉద్యోగుల నిరసన



భెల్ ప్రధాన గేటు వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ భెల్ (హెచ్‌పీవీపీ) ప్రొగ్రెసీవ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో బుధవారం భెల్ ప్రధాన గేటు వద్ద నిరసన చేపట్టారు. సిటూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ బీహెచ్‌పీవీ సంక్షోభంలో ఉన్నప్పుడు స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల తమకు మద్దతుగా నిలిచాయన్నారు. స్టీల్‌ప్లాంట్ సంక్షోభంలో ఉన్న సమయంలో తమ పూర్తి మద్దతు తెలియజేస్తూ ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భాగస్వాములుగా నిలుస్తున్నామన్నారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన బ్యాడ్జీలను కార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రొగ్రెసీవ్ ఫ్రంట్ నాయకులు ఉరుకూటి బాబూరావు, ఎస్.జగన్నాథరావు, వి.ఆనందరావు, పి.కనకారావు, సీతంనాయుడు, కె.కేశ్వ, ఎస్.వెంకట్రావు, సీహెచ్.మురళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నేడే స్టీల్ క్లబ్ ఎన్నికలు

ఉక్కునగరం: స్టీల్‌క్లబ్ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగింది.బరిలో ఉన్న వారు తమ అనుచరులతో కలిసి ప్రచారం హోరెత్తించారు. విజయతీరానికి చేరిస్తే ఎలాంటి కార్యక్రమాలు చేపడతారో హామీలు ఇచ్చారు. తమకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు.

ఒక పోస్టు ఏక గ్రీవం

సంయుక్త కార్యదర్శి పోస్టు ఏకగ్రీవం కాగా కార్యదర్శి పోస్టుకు నలుగురు, కోశాధికారి పోస్టుకు ఐదుగురు పోటీలో ఉన్నారు. అభ్యర్థులు అన్ని విభాగాలు తిరుగుతూ సభ్యులను కలిసి ఓటు అభ్యర్థించారు. అయితే ఈ ఎన్నికల్లో క్లబ్ క్వార్టర్లు అద్దెకు ఇవ్వడం, సభ్యులకు ఏటా ఇచ్చే గిఫ్ట్‌లను దుర్వినియోగం చేయడం, క్లబ్‌కు చెందిన ప్రాంతాన్ని అనధికారికంగా లీజుకు ఇవ్వడం, క్లబ్‌లో డెకరేషన్, లైటింగ్‌లో చేతివాటం చూపటం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రస్తుత కార్యవర్గంలోని ప్రధాన వ్యక్తులు మరలా పోటీ చేయడాన్ని సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. అదే విధంగా అంతకు ముందు పాలకవర్గంలో క్లబ్ నిధులు దుర్వినియోగం చేశారని నాటి డైరెక్టర్ (పర్సనల్), విజిలెన్స్ విభాగానికి ఆ కమిటీలోని సభ్యులే ఫిర్యాదు చేయగా ఆ ఫిర్యాదు ఎదుర్కొన్న వ్యక్తులు కూడా ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేస్తుండడంతో సభ్యులు నివ్వెరపోతున్నారు. క్లబ్ కార్యవర్గ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3.30 గంటల వరకు మరలా సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఫలితాలు వెల్లడించనున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాబూ నాయక్ తెలిపారు.

నూనెలు సలసల.. పప్పులు కుతకుత





ఎన్నికల వేళ.. ఎన్నికల వేళ కూటమి నేతల మాటలు కోటలు దాటాయి. మేం అధికారంలో ఉంటే ముస్లింలకు రంజాన్ తోఫా ఇచ్చేవారం.. హిందువులకు సంక్రాంతి కానుక అందించేవాళ్లం ..వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలు హాయిగా పండగ చేసుకోవడానికి కానుకలు ఇవ్వలేదని ఊదర గొట్టారు. ఇక అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం తోఫా సంగతి మరిచిపోయింది. సంక్రాంతి కానుక ఊసే లేదు.

కూటమి వచ్చాక ధరల సెగ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ధరల నియంత్రణను గాలికి వదిలేసింది. పేదలకష్టాలు పట్టనట్టు వ్యవహరిస్తోంది. ఫలితంగా వంటనూనెలు సలసల కాగుతున్నాయి. పప్పులు వండక ముందే కుతకుతలాడుతున్నాయి. వాటి ధరలు సామాన్య, మధ్యతరగతి ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఫలితంగా తెలుగింట పెద్ద పండగ అయిన సంక్రాంతి వేళ పిండి వంటలెలా అంటూ ప్రజలు హడలిపోతున్నారు. అన్ని ధరలూ ఇలా పెరిగిపోతే జీవనం సాగేదెలా అంటూ నిట్టూరుస్తున్నారు.

- ఏడాదిలో లీటర్ నూనెపై రూ.40 పెరుగుదల
- అదే బాటలో పప్పుల ధరల పరుగు
- విలవిల్లాడుతున్న సామాన్యులు
- పెరిగిన ధరలతో భారంగా మారిన పండగ
- ఖర్చులు తగ్గించుకునే దిశగా ఆలోచనలు



ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు ఇలా..(కిలోల్లో)

కందిపప్పు	రూ.190
మినపపప్పు	రూ.175
మినపగుళ్లు	రూ.215
పెసరపప్పు	రూ.140
శనగ పలుకులు	రూ.160
సన్‌ఫ్లవర్ నూనె	రూ.150
బెల్లం	రూ.70

గోపాలపట్నం: వంటలకు రుచి వచ్చేది కమ్మని నూనెతోనే. అయితే ఆ వంటనూనెల ధరలు చుక్కలను తాకడంతో సామాన్యులు వాటిని అందుకోలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతేడాదితో పోలిస్తే మార్కెట్‌లో నూనె ధరలు లీటరుకు రూ.25 నుంచి రూ.40 వరకు పెరిగాయి. సంక్రాంతి పండగ వేళ ఇప్పటికే విద్యుత్ చార్జీలు మోత మోగించగా నూనె ధరల మంటలతో వినియోగదారులు సలసల కాగిపోతున్నారు. దీంతో స్వీట్లు, హోటళ్లు, హాస్టల్ యాజమానులు మెనూలో ధరలను అమాంతం పెంచేస్తున్నారు.ఆన్‌లైన్‌లో పిండివంటలు ఆర్డర్ చేసిన వారికి అదనపు భారం పడనుంది. పప్పుల ధరలు సైతం భారీగా పెరిగిపోయాయి. దీంతో పిండివంటలు చేసుకునేదెలా అని ప్రజలు భయపడుతున్నారు.

పప్పుల చీటీలపై ప్రభావం

ఏడాది కాలంగా వినియోగదారుల నుంచి డబ్బు వసూలు చేసిన పప్పుల చీటీల నిర్వాహకులు ధరల పెరుగుదలతో హడలిపోతున్నారు. మొదటిలో ఇచ్చిన హామీ మేరకు సరకులు ఇస్తే భారీగా నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. కొంత మంది సరకులు తగ్గిస్తామంటుండగా... మరి కొంత మంది బ్రాండ్‌లు మార్చి ఇస్తున్నారు.

ధరలు పైపైకి

గతేడాది చివరిలో కేంద్ర ప్రభుత్వం సన్ ఫ్లవర్, సోయాబీన్, పామాయిల్ తదితర నూనెలపై దిగుమతి సుంకాలను 5.5 నుంచి 27.5 శాతానికి పెంచడంతో క్రమేణా ధరలు పెరుగుతూ వచ్చాయి. దిగుమతి సుంకాలు తగ్గిస్తే తప్పా నూనెల ధరలు దిగిరావని వ్యాపారులు అంటున్నారు. లీటర్ ప్యాకెట్‌తో పాటు 15 లీటర్ల డబ్బాలపై ధరలు పెరుగుతూ వినియోగదారులతో దోబూచులాడుతున్నాయి. ప్రస్తుతం సంక్రాంతి కారణంగా వీటి ధరలు మరింతగా పెరగవచ్చని భావిస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో వినియోగదారులకు నెలకు 550 టన్నుల వరకు నూనె అవసరం ఉంటుంది. ప్రస్తుతం సంక్రాంతి పండగ నేపథ్యంలో పిండివంటల కారణంగా ఈ వినియోగం 2100 టన్నుల వరకు ఉంటుందని అంచనా.

పండగ సందడి కరువే



ధరలు పెరగడం వల్ల పేద, మధ్యతరగతి వారికి ఇబ్బందిగా మారింది. సంపాదించింది ఖర్చులకే పోతుంటే ఇంటి సరకులు ఏవిధంగా తెచ్చుకుంటాం. గతంలో అమ్మ ఒడి, ఫీజు రియంబర్స్‌మెంట్ డబ్బులు వచ్చేవి. ఇప్పుడు అవి ఇవ్వలేదు. దీనికి తోడు ధరలు పెరగడం వల్ల పండగ భారంగా మారిపోయింది.

– హేమలత, దుర్గాపురం

మధ్య తరగతి వారిపై భారం



నిత్యవసరాల ధరలు బాగా పెంచేశారు. నియంత్రించే చర్యలు చేపట్టలేదు. ఇది మధ్యతరగతి వారిపై పెనుభారంగా మారింది. సంక్రాంతి పండగపై ధరల ప్రభావం పడుతోంది. కూరగాయల నుంచి ప్రతి వస్తువు అందనంత దూరంలో ఉంది.

– కంచిపాటి వెంకటరమణ, బుచ్చిరాజుపాలెం

రైతు బజారులో పామాయిలే..!

గోపాలపట్నం రైతు బాజరులో పామాయిల్ అమ్మకాలు చేస్తున్నారు. కొలో పామాయిల్ లీటరు రూ.110కి అందిస్తున్నారు. అయితే దీనికి నిబంధనలు విధించడంతో వినియోగదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పామాయిల్ పొందేందుకు బియ్యం కార్డు ఉండాలని.. ఫోన్ ఉండాలని సూచిస్తున్నారు. పామాయిల్ మాత్రమే విక్రయించడం.. దానికి కూడా ఫోన్, కార్డు ఉండాలని చెప్పడంపై వినియోగదారులు మండిపడుతున్నారు.

రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి



దుర్గానగర్‌కు వెళ్లే రహదారిలో ఇలా

కంచరపాలెం: జీవీఎంసీ 56 వార్డు కంచరపాలెం పరిధిలోని తోటవీధి నుంచి దుర్గానగర్ వెళ్లే రహదారిలో అడ్డంగా భవన నిర్మాణ సామగ్రిని వేసి మిల్లర్లతో శ్లాబులు వేస్తున్నారు. రాకపోకలకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొల్లకంచరపాలెం, రామ్మూర్తి పంతులుపేట, గవర కంచరపాలెం తదితర ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జోన్-5 టౌన్‌ప్లానింగ్, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ లోపంతో బిల్డర్లు నిర్లక్ష్యంగా పనులు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఇసుక, పిక్క, ఇటుక వంటి సామగ్రిని రోడ్ల మీద ఇష్టానుసారంగా వేస్తున్నారు. అడిగే వాడు లేకపోవడంతో ఇలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటుగా ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదారులు జారిపడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

వీధిలైట్లకు మరమ్మతులు



బీఆర్‌టీఎస్ రహదారిలో విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రధాన రహదారిలో విద్యుత్ దీపాల మరమ్మతు పనులను బుధవారం జీవీఎంసీ అధికారులు చేపట్టారు. వెలగని దీపాలను మరమ్మతులు చేయడం.. పనిచేయని వాటి స్థానంలో కొత్తవి వేశారు. రహదారిలో అన్ని లైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఏబీవీపీ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు

డాబాగార్డెన్స్: ఈ నెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్న ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ బుధవారం నగరంలోని ఓ హోటల్లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, రఘు విద్యా సంస్థల అధినేత రఘు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వర్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత 75 ఏళ్లుగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేశ అభివృద్ధిలో అనేక విధాలుగా భాగస్వామ్యం పంచుకుందని గుర్తు చేశారు. ఏయూ ఇంజినీరింగ్ గ్రౌండ్ వేదికగా ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఏబీవీపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు చిరేగి శివకుమార్, రాష్ట్ర కార్యదర్శి యాచంద్ర పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష పూజలు



కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు



అరచేతిలో పొన్నాకుపై హారతితో భక్తులు

- రేపు వైకుంఠ ఏకాదశి ఉత్తరద్వార దర్శనం

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాలు తుది దశకు చేరుకున్నాయి. 24వ రోజు బుధవారం విశేష పాశురాన్ని పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు జరిపారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుమురై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థగోష్టి చేశారు. తిరుప్పావై 24వ పాశుర విన్నపం చేసి, భావాన్ని వివరించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో వందలాది మంది భక్తులు పాల్గొని కుంకుమ పూజలు జరిపారు. పొన్నాకు అరచేత పట్టి హారతి ఇచ్చారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం వేంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వేకువజాము 4.30 నుంచి స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈవో నీలిమ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉచిత రవాణా సదుపాయం కల్పిస్తున్నారు. మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, అత్యవసర వైద్య సేవలు అందించనున్నారు. శనివారం కూడారై ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో వెల్లడించారు.

ముగిసిన ఉక్కు కార్మికుల 36 గంటల దీక్ష

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ప్రభుత్వాల తీరు మారకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కార్పొరేటర్ బి.గంగారావు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ సభలో ప్రకటించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 36 గంటల దీక్ష బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారంపై కన్నేసిన కేంద్రం వారి తాబేదారులకు స్టీల్‌ప్లాంట్‌ను అప్పగించాలనే యోచనలో ఉన్నారని ఆరోపించారు. కర్ణాటకలోని ఒక చిన్న స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక సాయం అందించిన కేంద్రం ఆసియాలో అతిపెద్దది అయిన విశాఖ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు ఎందుకు మొగ్గు చూపుతున్నారని ప్రశ్నించారు. ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం పూర్తి సామర్థ్యంతో నడిచేలా ఆర్థిక సాయం అందించాలని, బకాయిలు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, వై.టి.దాస్, ఎస్.రామారావు, వరసాల శ్రీనివాసరావు, కారు రమణ, రమణమూర్తి, మాటూరి శ్రీనివాసరావు, దాసరి సురేష్‌బాబు, డి.వి.రమణారెడ్డి, టివికె రాజు, కె.ఎం.శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, డి.ప్రసాద్, ఉరుకూటి సుహాసిని, మోహన్‌బాబు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

త్యాగాల ఫలితమే విశాఖ స్టీల్ ప్లాంట్



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ శ్రేణులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ పార్కులో చేస్తున్న దీక్షలు 1329వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని, ప్లాంట్ సొంత గనులు కేటాయిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశభక్తి పేరు చెప్పి సంపదను కారు చౌకగా ప్రైవేటు వ్యక్తులకు ధారపోయడం అన్యాయమన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల వచ్చింది కాదన్నారు. 67 గ్రామాల ప్రజలు ఇళ్లు, పొలాలు, ఆస్తులు త్యాగం చేస్తే వచ్చిందని గుర్తు చేశారు. 61 మంది సీపీఎం నాయకులు స్టీల్ ప్లాంట్ కోసం పదవీ త్యాగాలు చేశారన్నారు. ఈ ఉద్యమంలో 32 మంది బలిదానం చేశారని తెలిపారు. ప్లాంట్ పన్నులు, డివిడెండ్ల రూపంలో రూ. 50 వేల కోట్లు ప్రభుత్వానికి చెల్లించిందన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలంటే ఇక్కడి ప్రజల ఆమోదం కావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, ప్రకాశరావు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెం గ్రామానికి చెందిన కొలిమాల పల్లవి అనే డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైనట్లు తల్లి నాగమణి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. హెచ్‌సీ బి.దేముడు తెలిపిన వివరాలు.. పల్లవి పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 4న కాలేజీకి అని ఇంటి నుంచి బయల్దేరింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు తమకు తెలిసినవారిళ్లు, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ దేముడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాలిటెక్ ఫెస్ట్‌లో గైస్ విద్యార్థుల ప్రతిభ



పాలిటెక్ ఫెస్ట్‌లో ప్రత్యేక అవార్డు పొందిన గైస్ విద్యార్థులు

మురళీనగర్: విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పాలిటెక్ ఫెస్ట్ 2024 – 25లో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీలో వీరు రూ.25 వేల కన్సొలేషన్ బహుమతిని మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అందుకున్నారు. ప్రమాదాలను నియంత్రించేందుకు యానిమేటెడ్ ఏరియల్ వెహికల్ (యూఏవీ) డ్రోన్‌ను గైస్ విద్యార్థులు పి.భవానీ శంకర్, ఆర్.షైడిరాజు, ఎస్‌కే అబ్దుల్ రజాక్, టి.ప్రనూష్ విద్యార్థుల బృందం రూపొందించింది. వీరికి కెమికల్ బ్రాంచ్ రిటైర్డ్ విభాగాధిపతి డాక్టర్ బీవీ లక్ష్మణరావు, అధ్యాపకుడు ప్రదీప్ గైడ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఇతర అధ్యాపకులు అభినందించారు.

పాపం అభాగ్యులు



శ్రీహరిపురం, మల్కాపురం బస్టాప్‌ల వద్ద సాయం కోసం ఎదురు చూస్తున్న అభాగ్యులు, మానసిక రోగి

మల్కాపురం: వారంతా ఏ రాష్ట్రం వారో.. ఏ కుటుంబానికి చెందిన వారో ఆ దేవుడికే తెలియాలి. వారు మాట్లాడరు.. మనం చెప్పింది అర్థం చేసుకోలేరు. ఒంటరిగా బస్టాప్‌లు, ఫుట్‌పాత్‌పై ఎండకు ఎండుతూ..,వర్షానికి తడుస్తూ,చలికి వణుకుతూ ఉంటారు. ఎవరైనా దాతలు కరుణిస్తే వారిని ఆశ్రమాలకు తరలించి క్షేమంగా ఉండేలా చర్యలు తీసుకుంటారు. దాతలు రాకుంటే ఎవరు భోజనం పెడతారో అని ఎదురుచూడాల్సిన పరిస్థితి. ఇటీవల పారిశ్రామిక ప్రాంతంలో అభాగ్యుల సంఖ్య ఎక్కువైంది. వీరు ఏ ప్రాంతం నుంచి వస్తున్నారో.. మరెవరైనా నిర్లక్ష్యంగా విడిచిపెడుతున్నారో తెలియడం లేదు. మల్కాపురం,శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లో బస్టాప్‌ల వద్ద అటు ఇటూ తిరుగుతూ ఎవరైనా భోజనం పెడతారా అని ఆశగా ఎదురు చూస్తుంటారు. వీరిలో చాలా మంది మానసిక రోగులు ఉన్నారు. ఈ మానసిక రోగులకు మన మాట అర్థం చేసుకోరు.. అసలు వారికి ఏమి కావాలో చెప్పరు. చలికాలంలో రాత్రి వేళ గజ గజ వణుకుతూ ఉంటున్నారు. దాతలు ముందుకు వచ్చి ఇలాంటి వారిని ఆదరిస్తే వారిని ఆపన్న హస్తం ఇచ్చినవారు అవుతారు.

‘అడవివరం’ సొసైటీ డివిడెండ్ల పంపిణీ



సభ్యులకు డివిడెండ్ నగదు, క్యాలెండర్‌ను అందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి

సింహాచలం: అడవివరం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో బుధవారం నుంచి డివిడెండ్ల పంపిణీ ప్రారంభమైంది. సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి చేతుల మీదుగా పలువురు సభ్యులకు డివిడెండ్ నగదుతోపాటు, సొసైటీ రూపొందించిన క్యాలెండర్లు అందించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ సంక్రాంతి కానుకగా షేరుధనంపై 20 శాతం, థ్రిఫ్ట్ డిపాజిట్‌పై 8 శాతం వడ్డీని సంఘ సభ్యులకు డివిడెండ్ రూపంలో అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 20 వరకు డివిడెండ్ల పంపిణీ ఉంటుందని, సంఘ సభ్యులంతా సొసైటీ పనివేళల్లో వచ్చి తీసుకోవాల్సిందిగా కోరారు. సొసైటీలో లావాదేవీలన్నీ త్వరలో పూర్తిస్థాయి డిజిటలైజ్ జరుగుతాయని, సంఘ సభ్యులంతా సొసైటీకి ఆధార్‌కార్డుతో వచ్చి కేవైసీని అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బుటుబిల్లి మహేష్, పాలకవర్గ సభ్యులు బోర ప్రసాదరెడ్డి, మజ్జి ధర్మరాజు, సిబ్బంది పాల్గొన్నారు.